క్లుప్తంగా

నేడు మండపేటలో గడప గడపకూ..

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం పట్టణంలోని 12వ వార్డులో పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ కార్యాలయ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు మొదలయ్యే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

బీమా పథకాలపై అవగాహన



బీమా పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్న గ్రామస్తులు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో భారతీయ స్టేట్‌బ్యాంక్ ద్రాక్షారామ బ్రాంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీనివాస రెడ్డి గ్రామస్తులకు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకాలను గురించి అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ హసన్‌బాద కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలు వలివేటి కుమారి స్వాతి నేతృత్వంలో సుమారు 200 మంది ఈ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ ఝాన్సీ, సచివాయ సిబ్బంది, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర మైన శ్రవణ నక్షత్ర పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధానార్చకుడు బాల బాలాజీ ఆధ్వర్యంలోని పండితులు స్వామికి పంచామృతాభిషేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ నాయకులు దాసరి లక్ష్మణ మూర్తి, పెద్దింశెట్టి రామస్వామి, వెల్ల శ్రీను ఏర్పాట్లను సమీక్షించారు. గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, కోరుమిల్లి, టేకి, వెదురుముడి, నల్లూరు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కాలువగట్టును పటిష్టపరచాలి

కాజులూరు: తణుకువాడలో బలహీనంగా ఉన్న పంటకాలువ గట్టును పటిష్ట పరచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు వాసంశెట్టి శ్రీనివాస్, పితాని సుబ్రహ్మణ్యం, యిళ్ళ సత్యనారాయణ తదితరులు కోరుతున్నారు. శుక్రవారం గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ శలపాక రెవెన్యూ పరిధి నుంచి తణుకువాడ వరకూ పంటకాలువ ప్రవహిస్తుందన్నారు. ఈ కాలువపై లో లెవెల్ పైపు దగ్గర నుంచి 4వ నంబరు పైపు వరకూ గట్టు బలహీన పడి నీరుకట్టు సమయాల్లో తరచూ గండ్లు పడిపోతున్నాయన్నారు. దీంతో సకాలంలో పొలాలకు సాగు నీరందక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పాలకులు స్పందించి నిధులు మంజూరు చేసి ప్రస్తుత వేసవిలో కాలువగట్టు పటిష్టపరచేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

15న మండపేటలో ఐటీఐ అప్రెంటిస్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మండపేట ఎస్‌వీపీఆర్ ఐటీఐలో 15వ తేదీన అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల వర్మ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ, లేదా ప్రైవేట్ ఐటీఐలో ఫిట్టర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరు కావచ్చని, ఇతర వివరాలకు 95738 92777 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

మండపేట: వివాహిత అదృశ్యంపై శుక్రవారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ఛాయనాగదుర్గా సత్యవతికి రెండేళ్ల క్రితం కాకినాడకు చెందిన కె.శివకుమార్‌తో వివాహమైంది. ఈనెల 9న వేడుక నిమిత్తం పుట్టింటికి వచ్చింది. రాత్రి భోజనాలు చేసిన తర్వాత అంతా పడుకున్నారు. తెల్లారి లేచి చూసే సరికి తన చెల్లెలు కనిపించలేదని, పట్టణానికి చెందిన రౌతు రాజేష్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ సత్యవతి సోదరుడు ఎం. శ్యామ్‌సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కె అప్పారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇరువురి అరెస్టు

మండపేట: మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న ఇరువురిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె అప్పారావు, సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి స్థానిక పెద్ద కాలువ వంతెన సమీపంలో వాహనాల చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించిన ఇరువురిని గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. అలాగే రికార్డులు సక్రమంగా లేని 20 వాహనాలకు ఈ చలానాలు రాశారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు.. భవిష్యత్తుకు బాటలు

- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- క్లస్టర్ పరిధిలో 11 శాఖా గ్రంథాలయాలు



వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

రాయవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ, మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'వేసవి విజ్ఞాన శిబిరం' చిన్నారుల్లోని జ్ఞాపకశక్తిని పెంచుతోంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట పట్టణాలతో వెల్ల, పామర్రు, అముజూరు, కాజులూరు, రాయవరం, మాచవరం, అంగర, ద్రాక్షారామ, కపిలేశ్వరపురంలలో శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. వాటన్నింటిలోనూ ఈ నెల ఎనిమిది నుంచి జూన్ 11 వరకూ 35 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. సెలవుల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొని పుస్తక పఠనాన్ని అలవరుచుకోవడమే వీటి ముఖ్య ఉద్దేశం. చిన్నారుల కోసం ఇప్పటికే గ్రంథాలయాల్లో బాలల పుస్తకాలు ఏర్పాటు చేశారు.

బొమ్మలు గీస్తూ.. నైపుణ్యం మెరుగు పరుచుకుంటూ

విద్యార్థుల్లోని నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరం మంచి అవకాశంగా మారింది. ఉపాధ్యాయులు రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోజుకో కథ వినిపిస్తూ..ఆంగ్ల భాషలో మెళకువలు నేర్పిస్తున్నారు. పుస్తకాలు చదవడం, సమీక్షలు నిర్వహించడం, చిత్రలేఖనం..పేపర్ ఆర్ట్ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. వాటి ద్వారా మరింత విజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. విద్యార్థులను గ్రంథాలయాలకు చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలకు చిన్నారులు ఆసక్తిగా వస్తున్నారని గ్రంథాలయ అధికారులు తెలిపారు.

పుస్తకాలు, పేపర్ చదవడం నేర్చుకుంటూ

వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రస్తుతం సెలవులు కావడంతో రోజూ గ్రంథాలయానికి వచ్చి కథల పుస్తకాలు, పేపర్ చదవడం నేర్చుకుంటున్నారు. తాము తెలుసుకున్న సమాచారాన్ని స్నేహితులకు అవగాహన కల్పిస్తున్నారు. నచ్చిన పుస్తకాలను ఇంటికి తీసుకుని వెళ్లి చదువుకుని మరుసటి రోజు వచ్చి గ్రంథాలయంలో అప్పగిస్తున్నారు. ఇది ఒక మంచి అలవాటుకు దారి తీస్తుందని పలువురు తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

35 రోజుల పాటు నిర్వహిస్తాం



రోజుకు 50 నుంచి 60 మంది వరకు విద్యార్థులు వస్తున్నారు. 35 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించాల్సి ఉంది. విద్యార్థుల నుంచి స్పందన బాగుంది. కొత్త విషయాలను తెలుసుకునేందుకు అధిక సంఖ్యలో విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు.

– దడాల వెంకటరమణ, లైబ్రేరియన్, రామచంద్రపురం

ఉత్సాహం చూపిస్తున్నారు



వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థులు ఉత్సాహం చూపిస్తున్నారు. విద్యార్థులతో కథలు చదివించడం, తిరిగి ఆ కథలను వారితోనే చెప్పించడం, చిత్రలేఖనంలో తర్ఫీదునివ్వడం చేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను పంపిస్తూ వేసవి శిక్షణ శిబిరానికి సహకరిస్తున్నారు.

– టి.ప్రమీల, లైబ్రేరియన్, శాఖా గ్రంథాలయం, మాచవరం, రాయవరం మండలం

రైతు భరోసా అర్హుల జాబితాల ప్రదర్శన



రైతుల జాబితాను ప్రదర్శనలో పెడుతున్న ఏఓ సత్యప్రసాద్ తదితరులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం అర్హుల జాబితాలను ఆయా గ్రామాల ఆర్బీకేల వద్ద ప్రదర్శనలో ఉంచినట్టు మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. యనమదల రైతు భరోసా కేంద్రం వద్ద జాబితాలను ప్రదర్శనలో పెట్టిన సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రూ. 13,500 గాను, మే చివరిలో మొదటి విడతగా రూ.5,500 ఆయా రైతులకు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం కొత్తగా వ్యవసాయ భూములు కొనుక్కున్న రైతులకు కూడా పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసకుంటుందన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద అర్హుల జాబితాను తనిఖీ చేసుకుని ఎవరైనా రైతులు ఆ జాబితాలో లేకపోతే తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు.

చెరువులో చేపల మృత్యువాత



చెరువులో మృతి చెందిన చేపలు

మండపేట: పట్టణంలోని వైఎస్సార్ మున్సిపల్ మెమోరియల్ పార్కు చెరువులో చేపలు మృత్యువాత పడుతున్నాయి. చెరువులో నీరు అడుగంటుతుండడంతో ఎండల వలన ఆక్సిజన్ స్థాయి తగ్గి చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. పార్కుకు వచ్చే సందర్శకులు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను చెరువులో పడేస్తుండడంతో నీరు కలుషితం కావడం కూడా ఇందుకు కారణం అవుతోందని తెలిపారు. శుక్రవారం పదుల సంఖ్యలో చేపలు చనిపోయాయి. వీటి వలన మత్స్యకారులకు పెద్దగా నష్టం లేకపోయినప్పటికీ వీటి దుర్వాసనతో చుట్టుపక్కల నివాసాల వారు, పార్కులో వాకింగ్ చేసే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విషయం తెలిసి మత్స్యకారులు వాటిని ఏరివేసి తీసుకు వెళ్లిపోయారు. అధికారులతో మాట్లాడి చెరువులో నీటిని మొత్తం తోడి కొత్త నీటిని పట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మత్స్యకార సంఘం నాయకులు తెలిపారు.

నర్సులకు సత్కారం

కాజులూరు: మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం నర్సుల సేవలేనని ఈ భూమిపై ఎటువంటి భేదం లేకుండా ఇతరులపై ప్రేమా, ఆప్యాయత చూపించే గుణం ఒక్క నర్సులకు మాత్రమే ఉంటుందని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ 106 జిల్లా వైస్ గవర్నర్ వనుం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కాకినాడకు చెందిన అలయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గొల్లపాలెం పీహెచ్‌సీలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు నర్సులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎంతటి నైపుణ్యం కలిగిన వైద్యులైనప్పటికీ వారికి తోడుగా సేవాభావం కలిగిన నర్సులు ఉండాలన్నారు. కరోనా విపత్కర పరిస్థితులలో గ్రామాల్లోని ఏఎన్ఎమ్‌లు, నర్సులు చేసిన సేవలను కొనియాడారు. గొల్లపాలెం సచివాలయం-2లో పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు ఆధ్వర్యంలోనూ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించి స్థానిక ఏఎన్ఎమ్‌లు, నర్సులను సత్కరించారు. క్లబ్ కార్యదర్శి కడలి రాంపండు, వైద్యాధికారు డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రేయ, స్థానిక నాయకులు తోట కృష్ణ కొంతం నగేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



ధాన్యం దిగుమతులను పరిశీలిస్తున్న కాకినాడ ఆర్డీఓ సీతారామారావు తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రమేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సూర్యనారాయణ

కాజులూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథగిరి, ఆర్యావటం, గొల్లపాలెం తదితర గ్రామాలలో ఆర్డీఓ అధికారులతో పర్యటించి కొనుగోలు కేంద్రాలు, రైసుమిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా జగన్నాథగిరి రఘురామ రైసుమిల్లులో ఆయన మాట్లాడుతూ రైతులు బయట మార్కెట్‌లో దళారులను నమ్మి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామీణ స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయశాఖ, పౌరసరఫరాల శాఖ సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు రాకుండా చూడాలని, మిల్లుల వద్ద దిగుమతి సుజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తహసీల్దారు పోతురాజు, ఆర్ఐ వేగేశ్వర్రావు, స్థానిక వీఆర్వోలు, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు

కపిలేశ్వరపురం: రబీ ధాన్యాన్ని ప్రణాళికాబద్ధంగా కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్టు వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. టేకి ఆర్బీకేలో శుక్రవారం మండల సాగునలహా మండలి సమావేశం నిర్వహించారు. మండలి అధ్యక్షుడు పుట్టా కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, కరాటపు ఖండేశ్వరరావు, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల శాఖల అధికారులు, రైతులు హాజరయ్యారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ 2023 రబీ ధాన్యం కొనుగోలు ఆర్బీకేల ద్వారా సజావుగా సాగుతోందన్నారు. ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులను సరఫరా చేసేందుకు తగిన ప్రణాళికను రూపొందించామన్నారు.

అమ్మకాల్లో ఇబ్బంది లేకుండా చూడాలి

కె.గంగవరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ ఇళ్లా సూర్యనారాయణ సూచించారు. మండల పరిధిలోని కె.గంగవరంలో గల వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంట నష్టం 33శాతం కంటే అధికంగా ఉంటే పంట నష్టం నమోదు చేయాలని సూచించారు. ఈ ఏడాది సంబంధించి 20023-24కు రైతు భరోసాకు అర్హులైన జాబిత ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20లోపు తెలియజేయాలన్నారు. ఏడీఏ జయరామలక్ష్మి, ఏఓ బలుసు రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలికలు



ఎంపికైన బాలురు

రామచంద్రపురం: పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో శుక్రవారం బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-16 బాస్కెట్ బాల్ జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వార్డు కౌన్సిలర్ తోట అమ్మాజీ, ప్రాణ హాస్పిటల్ అధినేత గొల్లపల్లి శ్రీనివాస్, బరోడా బ్యాంక్ చీఫ్ మేనేజర్ అరుణ ఎంపికల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి, కార్యదర్శి బి.మాణిక్యాలరావు, సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎస్.అప్పలరాజుల పర్యవేక్షణలో జరిగాయి.

'నాడు-నేడు' పనులు వేగవంతం చేయాలి



రాయవరంలో ఎన్‌టీ బుక్స్‌ను పరిశీలిస్తున్న డీవైఈఓ షాలెంరాజు, ఎంఈఓ సత్యనారాయణ

రాయవరం: మనబడి 'నాడు-నేడు' పథకం రెండో దశలో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి షాలెంరాజు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక-4 స్టాక్ పాయింట్‌ను ఆయన ఎంఈవో వై.సత్యనారాయణతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో 'నాడు-నేడు' పనుల పురోగతి గురించి ఆయన ఎంఈవో సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఈ పనుల బాపతు ఫొటోలను ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ అయ్యేలా చూడాలన్నారు. అలాగే జగనన్న విద్యాకానుకలో సరఫరా అవుతున్న వస్తువుల నాణ్యతను పూర్తిగా పరిశీలించి, సంతృప్తి చెందిన తర్వాతే వాటిని దిగుమతి చేసుకోవాలన్నారు. అయితే ఇప్పటివరకూ ఎన్‌టీ బుక్స్ మాత్రమే స్టాక్ పాయింట్‌కు చేరుకున్నట్టు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా జేవీకేలో సరఫరా అయ్యే వస్తువులను ప్రత్యేక గదుల్లో ఉంచాలన్నారు. అనంతరం 'నాడు-నేడు' పనులు నిర్వహిస్తున్న పాఠశాలల హెచ్ఎంలతో ఎంఈవో సత్యనారాయణ సమావేశమయ్యారు. ఈ పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.రామారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ అంపోజు కృష్ణమూర్తి, సీఆర్పీలు కె.పోసిరాములు, వైఎల్ వీర్రాజు, వాసంశెట్టి సీతాధనలక్ష్మి, కె.సీనాసిరి, అకౌంటెంట్ సత్యనారాయణలు పాల్గొన్నారు.

అబలకు అండగా.. మహిళా సమ్మాన్

- రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్‌కు అవకాశం
- తపాలా శాఖ నూతన పథకం

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వివరాలు

డిపాజిట్	రెండేళ్ల తర్వాత వచ్చే మొత్తం
రూ.1,000	రూ.1,154
రూ.10,000	రూ.11,542
రూ.50,000	రూ.57,714
రూ.1,00,000	రూ.1,15,428
రూ.2,00,000	రూ.2,30,854



మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంపై పోస్టల్ శాఖ ఏర్పాటు చేసిన కౌంటర్

రాయవరం: మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల పథకాలను ప్రవేశ పెడుతున్నాయి. తపాలా శాఖ ఇప్పుడు మహిళలకు ప్రవేశ పెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనే కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం వారికి కొండంత అండగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అప్పుడే పుట్టిన వారి నుంచి మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన ఈ పథకానికి మరింతగా ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి పథకం అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఈ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు డ్రైవ్‌లు నిర్వహించే యోచనలో తపాలాశాఖ ఉంది.

వన్‌టైమ్ సేవింగ్స్ స్కీమ్

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వన్ టైమ్ సేవింగ్స్ స్కీమ్‌గా తపాలా అధికారులు పేర్కొంటున్నారు. 2025 మార్చి 31 వరకూ మాత్రమే ఈ పథకం అమల్లో ఉంటుందని తపాలా శాఖ తెలిపింది. ఈ స్కీమ్‌లో చేరే అమ్మాయిలు, మహిళలు కనిష్ట పెట్టుబడి రూ.1,000 నుంచి రూ.2 లక్షల వరకు ఒకేసారి డిపాజిట్‌గా చెల్లించవచ్చు. గరిష్ట మొత్తానికి రూ.2లక్షల లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశాన్ని కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉంటే కనీసం మూడు నెలల విరామంతో మళ్లీ ఖాతా తెరవచ్చు. సేవింగ్స్ ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తర్వాత మెచ్యూరిటీ కింద డబ్బులు డ్రా చేసుకునే అవకాశముంది. అయితే వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. అయితే ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు. మైనర్ అయితే గార్డియన్ ద్వారా డిపాజిట్ చేసుకునే వీలుంటుంది.

స్కీమ్‌లో చేరాలంటే..

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీమ్‌లో చేరాలంటే ఆధార్, పాన్‌కార్డులు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని సమీప పోస్టాఫీసుకు వెళ్లి ఖాతా ప్రారంభించవచ్చు. ఈ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తర్వాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకునే అవకాశముంది. ఒకవేళ డిపాజిట్‌దారులు మృతి చెందితే కారుణ్యం కింద ఖాతా మూసేయవచ్చు. ఎవరైనా మృతి చెందితే తదుపరి నామినీకి ఆ మొత్తాన్ని చెల్లిస్తారు. అవసరాన్ని బట్టి రెండు శాతం తగ్గించుకుని(5.5 శాతం వడ్డీతో) ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఖాతాను మూసేయవచ్చు.

పథకంలో 578 మంది

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు హెడ్ పోస్టాఫీసులు, 39 సబ్ పోస్టాఫీసులు, 196 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. ఈ పోస్టాఫీసుల పరిధిలో ఇప్పటి వరకూ 578 మంది మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో చేరారు. జిల్లాలో ఉన్న మహిళలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రచారం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం.



మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫి కెట్ అనేది మహిళలకు అధిక ప్రయోజనాలున్న పథకంగా చెప్పవచ్చు. ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కరపత్రాల ద్వారా పథకంపై ప్రచారం కల్పిస్తున్నాం. అధిక సంఖ్యలో మహిళలు ఈ పథకంలో చేరేలా చర్యలు చేపడుతున్నాం.

– ఎం.లక్ష్మణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్, రామచంద్రపురం సబ్ డివిజనల్ పోస్టాఫీసు

చోడవరంలో ఫ్యామిలీ డాక్టర్



పోషకాహారం అందిస్తున్న కేవీఆర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: చోడవరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వెల్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నేదూరి సంతోషమ్మ, ఎంపీటీసీ సాదే సుభద్ర ప్రారంభించిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణ 60 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. అనంతరం జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులకు నెలరోజులకు సరిపోయేలా బియ్యం, కోడిగుడ్లు ప్రొటీన్ పౌడర్, వేరుశెనగ చెక్కీలు, కందిపప్పు, గోధుమ నూక, రాగి పిండిలతో కూడిన పోషకాహార కిట్లు అందజేశారు. ఈ కిట్ల పంపిణీ వెల్లసావరం గ్రామానికి చెందిన కేవీఆర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కొప్పిశెట్టి వీరవెంకట సత్యనారాయణ(డాక్టర్ సత్తిబాబు) నేతృత్వంలో జరిగింది. కార్యక్రమంలో ఉండూరు పీఏసీఎస్ చైర్మన్ దంగేటి చినబాబు, కొప్పిశెట్టి సురేంద్రనాథ్ త్రిపాఠి, టీబీ సూపర్‌వైజర్ లీల, హెల్త్ సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, జి.కమల్‌శేషు, ఎంఎల్‌హెచ్‌పీ సౌభాగ్యశ్రీ, ఏఎన్ఎం శాంతామణి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.